# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## ఎవుసం గురించి తెలిస్తే ఇట్ల మాట్లాడరు



దంతాలపల్లి : కాంగ్రెసోళ్లకు ఎవుసం గురించి తెలిస్తే ఇట్ల మాట్లాడరు. వాళ్లకు ఓటేస్తే కారు చీకట్లే.. మూడు గంటల కరెంట్‌తో వ్యవసాయం సాధ్యమా..? 10హెచ్‌పీ మోటర్ పెడితే బోర్లు ఉంటయా..? ఒక్క దెబ్బకే మోటర్లు కాలుతయి. 10హెచ్‌పీ మోటర్లు కొనాలంటే ఖర్చు ఎక్కువ అవుతుంది. కొత్తగా పైపులు కొనాలే. ఇవన్నీ సాధ్యమా..? రేవంత్‌రెడ్డి మాటలు పిచ్చోడి చేతిలో రాయిలా ఉన్నాయి. 24గంటల నాణ్యమైన కరెంట్‌తో వ్యవసాయం సాఫీగా చేసుకుంటున్నాం. మూడు పంటలు పండుతున్నాయి. బావుల్లో బోర్లలో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయి. రైతులను మోసం చేయడానికే కాంగ్రెస్ నాయకులు మూడు గంటల కరెంట్, ఐదు గంటల కరెంట్ అనే మాటలు మాట్లాడుతున్నారు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టి మూడు గంటల కరెంట్ వస్తే మూడు మడులు కూడా పారవు. వరి పంటలు ఎక్కడికక్కడ ఎండిపోతాయి. 10హెచ్‌పీ మోటర్లు వాడితే కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుంది. కరెంట్ కష్టాలు మొదలవుతాయి. పట్నంల ఉండే రేవంత్‌రెడ్డికి పల్లెటూరి వ్యవసాయం గురించి ఏం తెలుస్తది. రాజకీయాలు వేరు వ్యవసాయం వేరు. తెలుసుకుని మాట్లాడాలే. సీఎం కేసీఆర్ ఇస్తున్న 24గంటల ఉచిత కరెంట్‌తో రైతులు చల్లగా బతుకుతున్నారు. చెరువుల నిండా నీళ్లు ఉన్నాయి.. చేతి నిండా పని ఉంది.. మూడు పంటలు పండుతున్నాయి. గతంలో చాలీచాలని కరెంట్‌తో బోర్లు మోటర్లు ట్రాన్స్‌ఫార్మర్లు కాలేది. కరెంటోల్ల చుట్టూ తిరిగేది. ఇప్పుడు ఆ బాధ పోయింది. సీఎం కేసీఆర్ చల్లగా ఉండాలే. రేవంత్‌రెడ్డి రైతుల జోలికి వస్తే బాగుండది. ఓటుతో బుద్ధి చెబుతారు.

*– బానోత్ రాములూనాయక్, రైతు, రేఖ్యాతండా*

## 24గంటల కరెంటు కేసీఆర్‌తోనే అయితది..



నర్సింహులపేట : రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చుడు ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే అయితది. రేవంత్‌రెడ్డి ఎవుసానికి 3 గంటలు కరెంటు సరిపోతుందని మాట్లాడిండు. గాయనకు ఎద్దు, ఎవుసం గురించి ఏమన్న తెలుసా..? బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చినంకే 24 గంటల కరెంటుతో పంటలు మంచిగ పండించుకుంటున్నం. నోటికి ఏదస్తే అది మాట్లాడే కాంగ్రెసోళ్లను ప్రజలు నమ్మేత లేరు. రైతులను కంటికి రెప్ప లెక్క కాపాడుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీనే గెలిపించుకుంటం. పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులను మోసం చేస్తుంది? 3 గంటల కరెంటుతో మళ్లీ పాత రోజులు వచ్చే ప్రమాదం ఉన్నది. 3 గంటలు కరెంట్ ఇస్తే మేం పంటలు సాగు చేయలేం. బీఆర్‌ఎస్ పార్టీకి ఓటేస్తేనే 24 గంటల కరెంటు ఉంటది.

*– గుగులోత్ కీమా, మధుతండా*

## ఎవుసం పడావు పడ్తది..



పెద్దవంగర: కాంగ్రెసోళ్లు 3గంటల కరెంటు ఇస్తే ఎవుసం పడావు పడ్డట్టే. మళ్లీ పాత రోజులు వస్తాయి. కరెంటు కోసం సబ్‌స్టేషన్ల ముట్టడీలు తప్పవు. రోడ్లెక్కి ధర్నాలు చేసుడు షురువైతది. గత ప్రభుత్వాల హయాంలో వలస వెళ్లిన అన్నదాతలు కేసీఆర్ సీఎం అయ్యాక చెరువులు నిండి సాగునీరు పుష్కలంగా అందాక మళ్లీ ఊరుబాట పట్టారు. వ్యవసాయం పండుగలా సాగి రైతన్నల బతుకులు బాగుపడ్డయ్. అరవై ఏళ్లు అనుభవించిన కరెంటు కష్టాలు మళ్లీ కావాలా మనకు. మన తెలంగాణలో మన రాజ్యమే ఉండాలే. ఢిల్లీ పెత్తనం మనకెందుకు. స్వరాష్ట్రం సాధించుకున్నం. తెలంగాణోళ్లమే పాలించుకోవాలి. ఇప్పుడిప్పుడే బాగుపడుతున్నం. పుసుక్కున కాంగ్రెస్‌కు ఓటేస్తే రిస్క్ పడ్డట్టే. మనల్ని ఇక ఎవరూ బాగు చేయరు. చాలా బాధ పడాల్సి వస్తుంది. అభివృద్ధి చేసిందెవరు. అండగా నిలుస్తున్నదెవరు ఆలోచన చేయాలి. తెలంగాణ రాక ముందు కరెంటు ఎట్లా ఉండే. ఇప్పుడు ఎలా ఉందో చర్చించాలి. పని చేసినోడికే ఓటెయ్యాలి. ఆంధ్రోళ్లను ఆదరించం.. వాళ్లు వద్దు, వాళ్ల పాలన వద్దు. కేసీఆర్ ముద్దు.

*– శ్రీరాం సంజయ్, పెద్దవంగర*

## మూడు గంటలు ఏం సరిపోతది ?



ఇనుగుర్తి : మాది వ్యవసాయ కుటుంబం. 17ఎకరాల భూమి ఉంది. 36ఏళ్లుగా ఎవుసం చేస్తున్న. ఎవుసానికి 3 గంటల కరెంటు సాలు అంటున్న కాంగ్రెసోళ్లు ఎన్నడన్న నాగలి పట్టిండ్రా.. భూమి దున్నిండ్రా.. వాళ్లకు ఏం ఎరుక. 3 గంటల కరెంటుతో ఒక్క మడి కూడా తడవదు. సీఎం కేసీఆర్ వచ్చాకే ఎవుసం బాగుపడింది. 24 గంటల కరెంటు ఇచ్చి రైతుల పాలిట దేవుడైండు. కాంగ్రెస్‌కు నమ్మితే మళ్లీ ఎన్కటి రోజులొత్తయి. పొలాలకు పారియ్యాలంటే తెల్లందాక బావుల కాడ నిద్రపోవాలె. ఇప్పుడు కేసీఆర్ ఇస్తున్న 24 గంటల కరెంటుతో మాకు వీలున్నప్పుడు మోటరు ఆన్ చేస్తే అదే పారుతున్నది.

*– గుండ్ల వెంకన్న(ఉప్పన్న), రైతు, చిన్ననాగారం*

## ధరణితోనే మా భూములకు భద్రత



నర్సింహులపేట : సీఎం కేసీఆర్ ఎంతో ముందు చూపుతో తెచ్చిన ధరణితోనే భూములకు భద్రత పెరిగింది. కాంగ్రెస్ నాయకులు ధరణిని రద్దు చేసి పట్వారీ వ్యవస్థ తెస్తమంటున్నారు. దీంతో భూములకు రక్షణ ఉంటుందా? పట్వారీ విధానం అమలైతే రైతులకు భూముల మీద ఉన్న ధీమా పోతది. ఇంకా కౌలుదారు కాలమ్ భయపెడుతున్నది. పట్నంలో చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే కొంతమంది రైతులు వాళ్లకున్నా కొద్దిపాటి భూములను కౌలుకు ఇయ్యాలంటే భయపడుతరు. దీంతో పంటలు పండే భూములు బీళ్లుగా మారుతయి. సాగు విస్తీర్ణం తగ్గి పనులు దొరక్క మళ్ల కరువు వస్తది. భూములు ధరలు కూడా పడిపోతయి.

*– జాటోత్ కిషన్‌నాయక్, హున్యతండా*

## మళ్లా ఆగంజేత్తరా ఏంది?



నెల్లికుదురు : కాంగ్రెసోళ్ల కు ఎవుసం గురించి ఏం తెల్వది. పంట పొలాలను పారించేందుకు 3 గంటల కరెంట్ ఎట్ల సరిపోతది. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ఖర్చులు పెరిగి రైతుల జీవితాలు ఆగమైతం. గతంల కాంగ్రెస్ ఇచ్చిన కరెంట్‌తో ముప్పతిప్పలు పడ్డాం. రాత్రనకా, పగలనకా పొలాల కాడికి వెళ్లినం. పడరాని పాట్లు పడ్డం. నెలలో రెండుసార్లు మోటర్లు కాలిపోయేవి. కరెంట్ కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురు చూసెటోళ్లం. ఇప్పుడు కేసీఆర్ పుణ్యమాని 24 గంటల కరెంట్‌తో రంది లేకుండా ఉన్నం. పంటలు మంచిగ పండుతున్నయి. దిగుబడి పెరిగి నాలుగు పైసలు కనబడుతున్నయి. మళ్లా కాంగ్రెసోళ్లు ఆగంజేత్తరా ఏంది? అయినా మేం కాంగ్రెసోళ్లను దగ్గరికి రానియ్యం. మమ్ములను మంచిగ చూసుకుంటున్న కేసీఆర్‌కే మా మద్దతు.

*– పులి రమేశ్, రైతు, నెల్లికుదురు*

## రైతుల మధ్య లొల్లి పెట్టించే కుట్ర



దంతాలపల్లి : పచ్చటి తెలంగాణలో రైతుల మధ్య చిచ్చు పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తున్నది. రైతుబంధు భూయజమానికి ఇస్తే కౌలుదారుడికి ఇవ్వమని, కౌలు రైతుకు ఇస్తే భూమి యజమానికి ఇవ్వమని చెప్పి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందే రైతుల మధ్య కొట్లాట పెడుతున్నడు. కౌలు రైతుకే రైతుబంధు ఇవ్వడం ద్వారా పట్టాదారుడు భూమిపై హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందే రెండు నాల్కల ధోరణితో రైతులను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నది. రైతుబంధుపై స్పష్టమైన విధానంతో ముందుకెళ్తున్న కేసీఆర్ వెంటే ఉంటం. రైతులెవరూ కాంగ్రెసోళ్లను నమ్మరు. వాళ్లు చెప్పేవన్నీ అబద్ధాలె. ప్రజలకు మంచిజేయడం వాళ్లకు చేతకాదు. ఆరు గ్యారెంటీల్లో ఒక గ్యారెంటీ మీద అప్పుడే యూటర్న్ తీసుకున్నరు. ఇగ మిగతావి కూడా రేపో, మాపో పోతయి.

*– అంకం సోమేశ్వర్, దంతాలపల్లి*

## ధరణిని కాదు..కాంగ్రెసోళ్లను పంపుతం



పెద్దవంగర: ధరణిని తీసేస్తమన్న కాంగ్రెసోళ్లనే ప్రజలు బంగాళాఖాతంల కలుపుతరు. ఈ ఎన్నికల తర్వాత వాళ్లు కంటికి కూడా కనిపించరు. దళారుల రాజ్యం తెద్దామనుకుంటున్నరు. వాళ్ల కుట్రలు నడవవు. తెలంగాణ ప్రజలు చాలా తెలివిఉన్నోళ్లు. కాంగ్రెస్‌కు గట్టిగనే వాతలు పెట్టబోతున్నరు. బీఆర్‌ఎస్ తెచ్చిన ధరణితోని మా భూములకు రక్షణ దొరికింది. ఆఫీసుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగే పని తప్పింది. గింత మంచిగ చేసిన కేసీఆర్‌ను ఎందుకు కాదనుకుంటం. ఈ సారి కూడా కాంగ్రెసోళ్లకు బుద్ధి చెప్పుడే. మంచి చేసినోళ్లనే ప్రజలు కావాలనుకుంటరు. కేసీఆర్ సారు ఏం జేసినా ప్రజల కోసం ఆలోచించి చేస్తరు.

*– ఆంగోతు శంకర్‌నాయక్, పోచారం*

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565